ఇందిరమ్మ ఇళ్లు ఇంకెప్పుడు?



- ఎదురుచూపుల్లో కరీంనగర్ నియోజకవర్గ ప్రజలు
- నేతల విభేదాలతో ఏర్పడని ఇందిరమ్మ కమిటీ
- కమిటీ ఆమోదంతోనే ప్రతిపాదనలకు మోక్షం
- సమీక్షలోనూ పెదవి విప్పని నేతలు, ఇన్‌చార్జి మంత్రి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పథకాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటి. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున నిర్మించి పేదలకు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించి పనులు చేపడుతున్నా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం ప్రజలకు ఆ యోగం పట్టడం లేదు. గ్రామ, జిల్లా స్థాయిల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి ఆ కమిటీల పర్యవేక్షణలో లబ్ధిదారులను గ్రామ సభల్లో గుర్తించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ పూర్తవుతుంది. జిల్లాలోని చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించడంతో పాటు ఇళ్ల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి.

పెండింగ్‌లోనే ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మధ్య ఆధిపత్య పోరు జరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకోలేక కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టారని అంటున్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికీ ఇందిరమ్మ కమిటీలనే ఏర్పాటు చేయలేదు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్‌కు చెందిన గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు సూచించినవారినే ఇందిరమ్మ కమిటీలలో నియమిస్తున్నారు. అయితే ఇక్కడ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురుమల్ల శ్రీనివాస్ ఇందిరమ్మ కమిటీలకు సభ్యుల పేర్లతో పాటు మరికొన్ని పదవుల కోసం ప్రతిపాదనలు చేస్తూ ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి జాబితా పంపించారు. అలాగే సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కూడా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పట్టణంలోని 60 డివిజన్లలో ఇందిరమ్మ కమిటీలలో చేర్చాల్సిన వారి పేర్లను ఇచ్చారు. వీరిద్దరూ జిల్లాకే చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సఖ్యత లేకుండా ఉండడం, వారిద్దరినీ ఆయన మరో మంత్రి శ్రీధర్‌బాబు వర్గీయులుగా గుర్తించి దూరం పెడుతున్న కారణంగా వారి ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. అలాగని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇందిరమ్మ కమిటీలను వేయించారా అంటే అదీ లేదు.

కరీంనగర్ నియోజకవర్గంలో పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక

జిల్లాలో మొదటి ఫేజ్‌లో ఒక్కో మండలానికి ఒక్కో గ్రామానికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని కరీంనగర్ నియోజకవర్గంలో 230,

(మిగతా 6వ పేజీలో)

జిల్లాలో 11,575 ఇళ్ల మంజూరు

రెండు రోజుల క్రితం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రగతిని పేర్కొన్నారు. జిల్లాలో 11,575 ఇళ్లను మంజూరు కేటాయించారని, ఫేజ్-1లో 2027, ఫేజ్-2లో 5,785 ఇండ్లకు మంజూరు ఇవ్వగా, మరో 3,763 ఇళ్ల మంజూరు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో ఉందని, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు కాకపోవడంతో అక్కడ 3,270 ఇళ్ల మంజూరు ఇవ్వలేకపోయామని వాటి మంజూరు ఇస్తే జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇద్దరు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదు. సమీక్షా సమావేశంలో జిల్లా కేంద్రంలోనే కమిటీ ఎందుకు ఏర్పాటు కాలేదు, ఇళ్ల మంజూరి ఎందుకు కాలేదు అనే విషయాన్ని చర్చకే తీసుకోకుండా దాటవేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- గంగాధరలో ఇందిరమ్మ ఇంటి పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్



ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర, మే 30 (ఆంధ్రజ్యోతి): చివరి శ్వాస వరకు చొప్పదండి నియోజవర్గ ప్రజలకు సేవ చేస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం గంగాధర మండలం మంగపేట ఫంక్షన్‌హాల్‌లో 721 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సంక్షేమ పథకాల అమలు చేయడంలో ఎక్కడ అవినీతికి తావులేదన్నారు. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికి 43 కోట్లు మంజూరు చేయబోతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఓటీలను పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రభుత్వం 200 కోట్లతో ఏర్పాటు చేయబోతుంద న్నారు. త్వరలోనే గంగాధర మండలంలో డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తామని తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్ లెవల్‌కు చేరిన ఇళ్లకు డబ్బులు చెల్లించామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు గ్రామ కార్యదర్శి దృష్టిలో ఉంచాలని అన్నారు.. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాము, తహసీల్దార్ అనుపమ, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, పార్టీ అధ్యక్షుడు మనోహర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలి

రామడుగు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా గర్భిణులను ప్రోత్సహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండి, రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన పీవోఎంసీహెచ్ డాక్టర్ సన జవేరియాతో కలిసి తనిఖీ చేశారు. హాజరు పట్టికను, అవుట్ పేషెంట్ రిజస్టర్, రికార్డులను, పరిశుభ్రతను, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మందులు తీసుకొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులకు మహిళలను ప్రోత్సహించి 100 శాతం స్క్రీనింగ్ పూర్తిచేస్తూ రీస్క్రీనింగ్ చేయాలన్నారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేలా ప్రోత్సహించాలన్నారు.కార్యక్రమంలో గుండి వైద్యాధికారి డాక్టర్ గ్రీష్మ, రామడుగు వైద్యాధికారి డాక్టర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన 'విద్యావాహిని'

- గంగాధర మండలంలో ప్రత్యేకంగా ఏర్పాటు
- 33 గ్రామాల్లో బడిబాట కార్యక్రమం
- 250 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు సిద్ధం



విద్యావాహినితో బడిబాట కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రావు

గంగాధర,మే 30 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యావాహిని కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది. వేసవి సెలవుల్లో మండలంలోని 33 గ్రామాల్లో విద్యావాహిని వాహనంతో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలతో కలిసి ఎంఈవో ప్రభాకర్‌రావు పర్యటించారు. ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి దానికి విద్యావాహినిగా నామకరణం చేశారు. వాహనానికి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు, మెరుగైన విద్య గురించి తెలిపే ఫ్లెక్సీలను కట్టించారు. అయితే ప్రతి గ్రామానికి విద్యావాహిని వాహనం వెళ్లే సమయాన్ని ముందుగానే అక్కడి క్లస్టర్ ఎంఆర్‌సీలకు షెడ్యూలు ఇచ్చారు. బడిబాట కార్యక్రమం నిర్వహించే గ్రామానికి విద్యావాహిని వాహనం చేరగానే అక్కడి ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ కమిటీలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు సిద్ధంగా ఉండే వారు. వారి సహకారంతో ఎంఈవో తల్లిదండ్రులను విద్యావాహిని వాహనం వద్దకు పిలిపించి ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలపై అవగాహన కల్పించేవారు. ఏంఈవో ప్రభాకర్ రావు చేపట్టిన

(మిగతా 6వ పేజీలో)

గుణాత్మకమైన విద్య నందించడమే ధ్యేయం

- ఏనుగు ప్రభాకర్‌రావు, ఎంఈవో ,గంగాధర

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి గుణాత్మకమైన విద్యనందించడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. కలెక్టర్ పమేలా సత్పతి మార్గ నిర్దేశం మేరకు ప్రైవేటు పాఠశాల ఫీజులు భవిష్యత్తులో ఉన్నత విద్యకు ఉపయోగపడతా యని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. ఒక వాహనం అద్దెకు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే కార్యక్రమాలను ఫ్లెక్సీపై ముద్రించి అవగాహన కల్పించాం. సీఆర్‌పీలు, అమ్మ ఆదర్శ కమిటీలు, ఉపాధ్యాయుల కృషితో మండల వ్యాప్తంగా ఇప్పటిక వరకు 250 పైచిలుకు విద్యార్థులు సర్కారు బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకువచ్చారు. నేను చేపట్టిన విద్యావాహిని కార్యక్రమం రాష్ట్ర విద్యాశాఖను ఆలోచింపచేసింది.

నగరంలో వంద రోజుల పరిశుభ్రత కార్యక్రమాలు

కరీంనగర్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన ప ట్టణ ప్రాంతాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికను రూపొందించిందని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలను నివాసయోగ్యమైన స్థిరమైన, పర్యావరణ అనుకూ లమైన నగ రాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు వంద రోజులపాటు వివిధ పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమా ల్లో ప్రజలతో పాటు పారిశుధ్య కార్మికులు, సమైఖ్య మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల సిబ్బందిని భాగస్వాములను చేస్తా మని తెలిపారు. ఈ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

చెరువు మట్టితో చేనుకు చేవ

- తగ్గనున్న చీడపీడల ప్రభావం

4

అక్రమంగా మట్టి తరలింపు

- అడ్డుకున్న గ్రామస్థులు
- పర్మిట్ ఒక చోట తవ్వకాలు మరోచోట
- తహసీల్దార్ కార్యాలయానికి వాహనాల తరలింపు



తహసీల్దార్ కార్యాలయంలో పట్టుబడ్డ టిప్పర్లు


తిమ్మాపూర్, మే 30, (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకపోవడంతో మైనింగ్, రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు. తవ్వకాలు జరుపుతున్న ప్రదేశానికి చేరుకున్న అధికారులు ఒక ఎక్స్‌కావేటర్, 10 టిప్పర్లను పట్టుకున్నారు. వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మండలంలోని పోలంపల్లి గ్రామ శివారు 69 సర్వేనెంబర్‌లోని కర్రల గుట్ట నుంచి సుమారు 2 సంవత్సరాల నుంచి ఎక్స్‌కావేటర్ల సహాయంతో టిప్పర్లను పెట్టి మట్టి, బండ రాళ్లను కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారి పనులకు దిలీప్ బిల్డ్ కాన్ అనే సంస్థ వారు తరలిస్తున్నారు. మల్లాపూర్ గ్రామ శివారులోని 104 సర్వే నెంబర్ నుంచి తవ్వేందుకు మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్న సంస్థ వారు అక్కడి నుంచి బండ రాళ్లు తీయకుండా పోలంపల్లి గ్రామ శివారులోని 69 సర్వేనెంబర్ నుంచి తీసుకుంటు న్నారు. అనుమానం వచ్చిన గ్రామస్థులు టిప్ప ర్లను ఆపి ప్రశ్నించడంతో విషయం బయటికి వచ్చింది. ఈ నెల 25 తేదీ వరకే మట్టి తరలించేందుకు అనుమతి ఉన్నా తదనంతరం కూడా పరిమితికి మించి పదుల సంఖ్యలో టిప్పర్లతో మట్టిని, బండరాళ్లను తరలించడంతో అధికారులు వాహనాలను పట్టుకున్నారు. పెద్ద పెద్ద టిప్పర్లు ప్రయాణిస్తుండటంతో పోలంపల్లి - గట్టుదుద్దెనపల్లి గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

తవ్వకాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టా రాజ్యంగా వ్యవహరి స్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎంత మేరకు తవ్వకం, ఎప్పటి వరకు తవ్వకాలు, ఏ సర్వే నెంబర్ అనేది అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పోలం పల్లి గ్రామస్థులు పేర్కొంటున్నారు.

బ్లాస్టింగ్‌తో గ్రామాల్లో భయంగా ఉంది


- బుడిగె కొండయ్య, పోలంపల్లి మాజీ సర్పంచ్



ఒక్క దగ్గర అనుమతి తీసుకొని మరోదగ్గర మట్టి, బండరాళ్ల తవ్వుతున్నారు. మట్టి తవ్వకాలకు అనుమతి లేదు. అధికారుల పర్యవేక్షణ లేదు. పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే బ్లాస్టింగ్ పోలంపల్లి, మల్లాపూర్ గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. పోలంపల్లి-గట్టుదుద్దెనపల్లి రాహదారి టిప్పర్ల కారణంగా పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు, నిర్వాహకులపై చర్యలు తీసుకుని పర్యావరణాన్ని కాపాడాలి.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

- శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్, తిమ్మాపూర్



అనుమతులు లేకుండా మట్టి, బండరాళ్ల తవ్వకాలు జరుపుతున్నారని పోలంపల్లి గ్రామస్థులు సమాచారం అందించారు. వెంటనే రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో పాటు మైనింగ్ అధికారులు తవ్వకాలు జరుపుతున్న ప్రదేశానికి వెళ్లి సరైన అనుమతులు లేకపోవడంతో 10 టిప్పర్లను, 1 ఎక్స్‌కావేటర్ పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించాం. తర్వాత చర్యల కోసం మైనింగ్ శాఖకు అప్పగిస్తాం.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన బేతి కృష్ణ(38) ఉరివేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బేతి కృష్ణ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం వేకువజామున కృష్ణ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


గాజె అంజి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామానికిచెందిన గాజె అంజి(20) పట్టణంలో గురువారం జరిగే సంతకువచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈక్రమంలోనే ద్విచక్రవాహనం పెద్దపాపయ్యపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీకెనాల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం వెనకాలవస్తున్న ట్రాక్టర్‌వేగంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన యువకుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైనచికిత్స కోసం హన్మకొండలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి గాజె రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

అస్వస్థతకు గురైన మహిళ

● చికిత్స పొందుతూ మృతి


భాగ్యలక్ష్మి (ఫైల్)

జమ్మికుంట రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన కొత్తగట్టు భాగ్యలక్ష్మి(55) చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాతపడింది. భాగ్యలక్ష్మి-ఆగయ్య దంపతులు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారం క్రితం కూలి పనికి వెళ్లిన ఆమె ఎండ తీవ్రతకు తట్టుకోలేక అస్వస్థతకు గురైంది. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృత్యువాత పడింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ బావిలో పడిన ట్రాక్టర్

● డ్రైవర్ మృతి

మల్లాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మల్లాపూర్ మండలకేంద్రంలో శుక్రవారం ట్రాక్టర్‌తో పొలం దున్నతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి వ్యవసాయబావిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌ను నాడుపుతున్న మాట్లా పెద్దులు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని శనిగారపు రమేష్ అనే రైతు పొలాన్ని మాట్లా పెద్దులు(61) తన ట్రాక్టర్‌తో దున్నుతున్నాడు. ఈక్రమంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి వ్యవసాయ బావిలో పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌డ్రైవర్ బావిలోని నీటిలో మునిగిపోయాడు. సమీపంలో పలువురి రైతులు గమనించి ట్రాక్టర్‌ను, మాట్లా పెద్దులును బయటకుతీశారు. కానీ అప్పటికే పెద్దులు మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అక్రమ్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆటో ట్రాలీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన సంఘటన మండలంలోని గంగారం గ్రామశివారులో చోటుచేసుకుంది. కూనారం గ్రామానికిచెందిన ఎండి.అక్రమ్ (27) కాల్వశ్రీరాంపూర్ మండలకేంద్రంలో ఆటోమెకానిక్ వర్క్‌చేస్తుంటాడు. శుక్రవారం అక్రమ్ పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామమైన కూనారం వెళ్తుండగా గంగారం గ్రామశివారులో ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో ఢీకొంది. దీంతో అక్రమ్ కింద పడడంతో తలకు, చేతులకు గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడు అక్రమ్‌కు భార్య సమీరాబేగం, తల్లిదండ్రులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై వెంకటేష్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం సుల్తానాబాద్‌కు తరలించారు. ఆటోడ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామశివారులో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికిచెందిన రాజయ్య అనే వృద్దుడు తన ద్విచక్రవాహనంపై గామంలోకి, జమ్మికుంటకు చెందిన రంజిత్ అనే యువకుడు కరీంనగర్‌వైపు వెళ్తున్న క్రమంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

చెరువు మట్టితో చేనుకు చేవ

● ఉపయోగాలు ఎన్నో..

● తగ్గనున్న చీడపీడల ప్రభావం

● ఉపాధిహామీ ద్వారా తవ్వించి పొలాలకు తరలింపు

హుజూరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో రోజు రోజుకు భూసారం తగ్గిపోతుంది. రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడటంతో చీడపీడల ప్రభావం పెరిగింది. దీంతో రైతులు భూమి సహజ గుణాన్ని కోల్పోకుండా పోషక విలువలు కలిగిన చెరువు మట్టిని తమ పంట పొలాల్లో వేసుకునేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. చెరువు మట్టిని పొలాల్లో వేస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని రైతులు భావిస్తున్నారు. ఉపాధిహామీ ద్వారా వివిధ చెరువుల్లో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. చెరువు మట్టిని రైతులు ట్రాక్టర్ల ద్వారా పంట పొలాల్లో పోసుకునేందుకు ఆసక్తి చూపెడుతున్నారు. హుజూరాబాద్ మండలంలో 13చెరువుల్లో పూడిక తీత పనులను కొనసాగుతున్నట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు.


హుజూరాబాద్ మండలం కందుగుల చెరువులోని మట్టిని తీస్తున్న ఉపాధిహామీ కూలీలు

● చెరువు మట్టిలో పోషకాలు

చెరువులోని సారవంతమైన మట్టిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు చెరువు మట్టిని ప్రభుత్వం అందజేస్తుంది. ఉపాధి కూలీలు చెరువులోని మట్టిని తవ్వితే రైతులు తాము తెచ్చుకున్న ట్రాక్టర్లలో కూలీలు మట్టి పోస్తున్నారు. చెరువు మట్టిని పొలాల్లో పోయడం వల్ల రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. పంట ఎదుగుదలకు రైతులు విపరీతంగా ఎరువులు వాడుతున్నారు. అధిక దిగుబడుల కోసం ఎరువులు వేస్తే చీడపీడలు ఆశిస్తున్నాయి. శక్తివంతమైన పురుగు మందులను రైతులు పిచికారి చేయాల్సి వస్తుంది.

దీంతో భూసారం కోల్పోయి దిగుబడులు రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. పంట పొలాల్లో భూసారం రోజు రోజుకు తగ్గిపోతుంది. సేంద్రియ పదార్థాలు, సూక్ష్మ పోషకాల శాతం రోజు రోజుకు పడిపోతున్నాయి. రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ భూమి సహజ గుణాన్ని కోల్పోకుండా పోషక విలువలు కలిగిన చెరువు మట్టిని పొలాల్లో రైతులు వేస్తున్నారు. దీంతో రైతులు ఎంతో ప్రయోజనం ఉంటుందంటున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని 13 చెరువుల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. చెరువుల్లో కూలీలు తీసిన పూడిక మట్టిని రైతులు పంట పొలాల్లో పోసుకుంటున్నారు.

● తేమశాతం తగ్గకుండా చూసుకోవచ్చు

చెరువు మట్టిలో అనేక పోషకాలు ఉంటాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా వ్యవసాయ సాగు, వర్షాధారం, బోరుబావులు, వ్యవసాయ బావులు చెరువుల కింద సాగు అయ్యే భూములు అధికంగా ఉన్నాయి. ఇలాంటి భూముల్లో చెరువుల్లో పూడికతీసిన మట్టి పోయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటున్నాయి. ఈ మట్టిలో నత్రజని, భాస్వరం, పోటాషియంతో పాటు వివిధ రకాలైన పోషకాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాక నేలలో తేమ శాతం తగ్గకుండా కాపాడుకోవచ్చు. నీటి నిల్వ సామర్థ్యం పెంపుతో పంటలకు మేలు కలుగుతుంది. సూక్ష్మ పోషకాలు వంటివి వేయకుండా పంటలకు చెరువు మట్టి ఎంతగానో ఉపయోగపడుతుంది. రోగాల బారి నుంచి కూడా కాపాడుతుంది. చెరువు మట్టిని పంట పొలాల్లో వేయడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చు. ఈ మట్టితో భూమి గుల్లబారి నాటిన మొక్కలు భూమి లోతుగా చొచ్చుకుపోతాయి. దీంతోవేర్లు బలంగా తయారై అధిక దిగుబడులు సాధించవచ్చు. ఒకసారి భూమిలో పోసిన చెరువు మట్టి మూడేళ్ల వరకు పని చేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతిసారి చెరువు మట్టిని పొలాల్లో పోయిస్తున్నా


విజేందర్‌రెడ్డి, రైతు, కందుగుల

చెరువు మట్టిని పొలాల్లో పోయడం వల్ల పంటలు మంచి దిగుబడి వస్తున్నాయి. రసాయ నిక ఎరువుల కంటే చెరువు మట్టి ఎక్కువగా పని చేస్తుంది. గతంలో కూడా చెరువు మట్టిని తన పొలంలో పోయడం వల్ల పంటలు బాగా పండాయి. అందుకే ప్రతి సంవత్సరం చెరువులోని పూడిక మట్టిని ఉపాధిహామీ పథకం ద్వారా పొలాల్లో పోయించుకుంటున్నాను.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాల పట్టివేత

● అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు దేవునిగుట్ట తండా గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లలతో పాటు జేసీబీ, ఎక్స్‌కవేటర్‌లను పట్టుకున్నామని ఆర్‌ఐ శ్రవణ్ శుక్రవారం తెలిపారు. వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. దేవునిగుట్టతండాలో వాహనాలను పట్టుకుని కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో సురేందర్ అనే వ్యక్తి విధుల్లో ఉన్న అధికారులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించాడని చెప్పారు. సదరువ్యక్తిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆర్‌ఐ శ్రవణ్ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● కాలిపోయిన విలువైన డాక్యుమెంట్లు, నగదు

మల్లాపూర్, మే, 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన తోటలక్ష్మి ఇంట్లో విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. శుక్రవారం ఉదయం లక్ష్మి ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే లోపు షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో ఇరుగుపొరుగు సాయంతో మంటలను ఆర్పీ అదుపులోకి తెచ్చారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా విలువైన డాక్యుమెంట్లు, బట్టలు, పదివేల నగదు, వస్తువులు కాలి బూడిదైనట్లు లక్ష్మి గుర్తించింది. బాధిత మహిళను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కాలిపోయిన సామగ్రి

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న టిప్పర్

● టిప్పర్‌ను ఢీకొన్న వెనకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు

● ముగ్గురికి గాయాలు

మల్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-కరీంనగర్ రహదారిలోని రాజారం స్టేజీ సమీపంలో శుక్రవారం టిప్పర్, ద్విచక్రవాహనం, ఆర్టీసీ బస్సు ఢీకొన్నఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్‌ను డ్రైవర్ అకస్మాత్తుగా నిలిపాడు. దీంతో టిప్పర్ వెనకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన నీరజ్‌తో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బైక్‌ను ఢీకొన్న లారీ

ఆర్టీఐ దరఖాస్తును తిరస్కరించిన పంచాయతీ కార్యదర్శి

● కేసు నమోదు

ఇల్లందకుంట, మే 30 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ప్రకారం దాఖలైన దరఖాస్తు పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్యదర్శి, జిల్లా పంచాయతీ అధికారిపై హుజూరాబాద్ కోర్టు ఆదేశాలతో శుక్రవారం కేసు నమోదైంది. ఇల్లందకుంట మండలానికి చెందిన మల్యాల గ్రామానికి చెందిన వేముల తిరుపతి మే 18, 2023న గ్రామపంచాయతీ కార్యాలయానికి పోస్టాఫీస్ ద్వారా రిజిస్టర్ పోస్టుచేశాడు. పంచాయతీ కార్యదర్శి పోస్టును తిరస్కరించడంతో, తిరిగి తిరుపతి వచ్చిన వెంటనే ఆ రిజిస్టర్ పోస్టు చూడగా రిజిస్టర్ పోస్టుపై పంచాయతీకార్యదర్శి రెఫ్యూజ్ రాసి ఉండడం చూసి ఆ తర్వాత ఈ విషయాన్ని జూన్5, 2023న జిల్లా పంచాయతీ అధికారి వద్ద ఫిర్యాదుచేశాడు. ఎలాంటి చర్యలు తీసుకోలేదని తిరుపతి ఆవేదన వ్యక్తం చేశాడు. తదనంతరం న్యాయవాది ఆడెపు లింగమూర్తిని సంప్రదించి, హుజూరాబాద్ రెండవ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ కంప్లయింట్ దాఖలు చేశారు. కేసు వాదనలు పరిశీలించిన కోర్టు అప్పటి పంచాయతీకార్యదర్శి మట్ల రాజేష్(ఏ1), జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య (ఏ2)పై కేసునమోదు చేయాలని ఇల్లందకుంట పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. తదను గుణంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ 67/2025గా కేసు నమోదు చేశారు.

ఎస్‌యూలో చరిత్ర, టూరిజం విభాగం ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో చరిత్ర, టూరిజం డిపార్ట్మెంట్‌ను ఏర్పాటుచేయాలని, అలాగే విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శాతవాహన వంశ మూలపురుషుడైన శాత వాహనుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, కోరుతూ శుక్రవారం చరిత్ర పరిరక్షణ సమితి, రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో శాతవాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జాస్తిరవికుమార్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శాతావాహనుడి విగ్రహం ఏర్పాటు చేయడానికి ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తొందరలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి చరిత్ర, టూరిజం విభాగాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు తెలిపారు. కార్యక్రమం లో చరిత్ర చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి, వ్యవ స్థపాకుడు డాక్టర్ సందవేణి తిరుపతి, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ టూరిజం ప్రొఫెసర్ గుజ్జెటితిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జి.రాజేందర్, టి.పుష్పలత, టి.రమేష్,డా. టి.శ్రీనివాస్, డా.ఏ కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న చరిత్ర పరిరక్షణ సమితి, రాష్ట్ర కమిటీ నాయకులు

లెదర్‌పార్కుకు నిధులు మంజూరు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం నాయకులు

సుభాష్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని లెదర్ పార్కుకోసం నిధులు కెటాయించాలని తెలంగాణ లెదర్ ఇండస్ట్రీయల్స్ సాధన, చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొత్తూరి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం లెదర్‌పార్కు ఏర్పాటు కోసం 136 ఎకరాల భూమని కెటాయించిందని తెలిపారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లెదర్ పార్కు నిర్మాణాన్ని చేపట్టాలని, అందుకు నిధులు కెటాయించాలని కోరారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు


ఆలయానికి బయలు దేరిన గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, మే, 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రికర్ల గ్రామంలో గంగమ్మ తల్లి బోనాలను నాయకులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం భక్తులు ఆలయంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గంగపుత్రసంఘం ఆధ్వర్యంలో మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య యువతి, యువకుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలుచేసిఅమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, గంగపుత్ర సంఘం నాయకులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల బ్లాక్ ఫిల్మ్ తొలగింపు


బ్లాక్ ఫిలింను తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐలు

కరీంనగర్ క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాల అద్దాలపై అతికించిన బ్లాక్ ఫిల్మ్‌ను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ చౌక్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవ్‌లో 20 కార్లు, ఇతర వాహనాల అద్దాలపై అటించిన బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించి వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ కరీముల్లా ఖాన్ మాట్లాడుతూ కార్ల అద్దాలపై నల్ల స్టిక్కర్ల వినియోగం చట్ట విరుద్ధమన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువని, వాహనదారులు నిబంధనలను గౌరవించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. డ్రైవ్‌లో సీఐ పర్శ రమేష్ ఉన్నారు.

మహిళ హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): మహిళను హత్యచేసిన కేసులో జగిత్యాల రూరల్‌మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నక్క వంశీ అనే వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రెండువేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని పాత బస్తీ ప్రాంతానికి చెందిన మంద స్వప్నకు వివాహం కాగాభర్త వదిలివేయడంతో కూలీ పనిచేసుకుని తన కుమారుడిని పోషిస్తోంది. ఈ క్రమంలో జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నక్క వంశీ అనే వ్యక్తితో స్వప్నకు హైదరాబాద్‌లోని నాచారం రైల్వేస్టేషన్‌లో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. 2018 అక్టోబరు 19న స్వప్నను ప్రేమ వివాహం చేసుకునేందుకు జగిత్యాలకు రావాల్సిందిగా వంశీ కోరాడు.

దీంతో స్వప్న తనదగ్గర ఉన్న వెండి వస్తువులను తాకట్టుపెట్టి జగిత్యాల ప్రాంతానికి చేరుకుంది. అదే రోజు రాత్రి సమయంలో గొల్లపల్లి మండలం వెంగలాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందగా, గుర్తుతెలియని మహిళా అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి దర్మపురి సీఐ లక్ష్మీబాబు కేసు దర్యాప్తు చేశారు. స్వప్నను ప్రేమ వివాహం చేసుకుంటానని వంశీ అనే వ్యక్తి నమ్మించి అనుమానంతో టవల్‌తో గొంతు నులిమి హత్య చేసినట్లు గుర్తించారు. నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కిరణ్‌కుమార్, కోర్టు డ్యూటీ అధికారి శ్రీధర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వంశీకి జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

టెండర్లకు దరఖాస్తులు చేసుకోవాలి

సిరిసిల్ల టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల ఆర్టీసీడిపో పరిధిలోని అన్ని బస్టాండ్‌లలో ఖాళీగాఉన్న దుకాణాలు, వాహనాల పార్కింగ్‌లకు టెండర్లకు ఆహ్వానిస్తున్నామని ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం డిపో మేనేజర్ ప్రకాష్‌రావు తెలిపారు. సిరిసిల్ల పట్టణం కొత్త బస్టాండ్‌లోని వాహనాల పార్కింగ్, క్యాంటిన్, ఎల్లారెడ్డిపేట బస్టాండ్‌లోని అద్దెకు దుకాణం, పార్కింగ్, ముస్తాబాద్ బస్టాండ్‌లో రెండు అద్దె దుకాణాలకు టెండర్లు వేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో యార్డ్, గ్యారేజిలో స్వీపింగ్, క్లీనింగ్ కాంట్రాక్ట్ వర్క్‌కు టెండర్‌లు వేయడం కోసం డిపోలో టెండర్ ఫారంలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9949373819, 8686869005 నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్టాఫ్ నర్సుకు తీవ్రగాయాలు

మానకొండూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని చెరువుకట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టాఫ్‌నర్సుకు తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న బిజిలి లత(31) ఎప్పటి లాగే శుక్రవారం టిజి02 9326 నెంబరు గల హోండ ఆక్టీవపై ఆసుపత్రికి వస్తుండగా చెరువుకట్ట వద్ద వెనుక నుంచి వస్తున్న ఏపి 15టిబి 9632 నెంబరు గల ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ లతను 108లో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి బంధువు బిజిలి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

రైల్వేగేట్‌కు మరమ్మతులు

● నిలిచిన రాకపోకలు

గంగాధర, మే 30 (ఆంధ్రజ్యోతి): గంగాధర శివారులోని ప్రధాన రహదారిపై రైల్వే గేటుకు శుక్రవారం రైల్వేసిబ్బంది మరమ్మతులు జరిపారు. మూడురోజుల క్రితం ట్రక్కుఓవర్ లోడుతో వెలుతూ గేట్ రాడ్‌కు తగిలింది. దీంతో అప్పటి నుంచి ఒకవైపు గేట్ ఆటోలాక్ పని చేయడం లేదు. తరుచూ రైళ్లు వస్తూ పోతున్న సందర్భంగా అక్కడి సిబ్బంది గేట్‌ను లేపాల్సి వస్తోంది. శుక్రవారం సిబ్బంది మరమ్మతులు జరిపి సరిచేశారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రధానరహదారి కావడంతో అరగంటపాటు భారీగా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

చందుర్తి, మే 30 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు చందుర్తి ఎస్ఐ అంజయ్య శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపిన రమేష్, సయ్యద్ జానీ, రంజిత్, పరశురాములు, రమేష్ లకు ఒక్కొక్కరికి రూ.2000 జరిమానాలతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై పేర్కొన్నారు.

నీటి సంఘాలు లేనట్లేనా?



- నీటి సంఘాల కమిటీ కోసం రైతుల నిరీక్షణ
- 2010 ఓటర్ల సవరణతోనే నిలిచిన ప్రక్రియ
- 2015లో ఎన్నికలు ప్రతిపాదించినా తిరస్కరించిన ప్రభుత్వం
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 666 చెరువులు, మూడు ప్రాజెక్టులు
- చెరువులు, కుంటలపై పర్యవేక్షణ కరువు

సిరిసిల్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంట ల నిర్వహణ, పర్యవేక్షణలో కీలకంగా పని చేసిన నీటి సంఘా లకు గత ప్రభుత్వం మంగళం పాడింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తక పో వడంతో రైతుల్లో నీటి సంఘాలు లేనట్లేనా అనే అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సాగునీటి వినియోగదారుల సంఘాల వ్యవ స్థను పునరుద్ధరించాలని, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ గతంలో ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రతి చెరువుకు ఒక సాగు నీటి సంఘాన్ని ఏర్పాటు చేయా లని 2025 సంవత్సరాన్ని చెరువుల సంవత్సరంగా ప్రకటించి చెరువుల పునరుద్ధ రణ, తూములు, కట్టలు, కాలువలు, చెరువుల మరమ్మతులు చేపట్టాలని సూచనలు చేసింది.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మళ్లీ సాగునీటి సంఘాల ఎన్నికలు రాబోతున్నాయని రైతులు భావించినా నిరాశే మిగి లింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నీటి సంఘాలు లేకపోవ డంతో దాదాపుగా 14 ఏళ్లుగా నీటి వినియోగంపై అజమా యిషీ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. చెరువులపై జవాబుదారీ ఎవరు? అనే ప్రశ్న మిగిలిపోయింది. నీటి పారుదల శాఖలో ఏర్పడ్డ, మార్పులు చేర్పులు చేస్తూ గత ప్రభుత్వం చిన్ననీటి పారుదల శాఖను నీటి పారు దల శాఖలో విలీనం చేసింది. ఫలితంగా చిన్న నీటి వనరులను పర్యవేక్షించే వారే లేకుండాపోయారు. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో ఆదర్శ రైతు ల విధానాన్ని రద్దు చేసి రైతు సమన్వయ సమి తులను ఏర్పాటు చేసింది. వారికే చెరువుల బాధ్యతలు కూడా అప్పగిస్తారని భావించినా ఆచరణలోకి రాకుండానే గడిచిపోయింది. కొత్త ప్రభుత్వం రైతు సమన్వయ సమితులను రద్దు చేసింది. దీంతో రాజ న్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నా 666 చిన్న నీటి వనరు లు, చెరు వులు, కుంటలపై మళ్లీ నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి పర్యవేక్షిస్తారా? లేక నిస్తేజంగా వదిలేస్తారా? అనే చర్చ జరుగుతున్నది.

ఉమ్మడి రాష్ట్ర హయాంలో 2010లో నీటి సంఘా ల ఓటర్ల సవరణతోనే నిలిచిపోయింది. ఆ తరువాత 2015లో తెలంగాణ ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల్లో కదలిక వచ్చినా తరువాత నిలిపివేశారు. భారీ వర్షాలకు ఎత్తిపోతల తో చెరువుల్లోకి నీరు చేరినా పంటలకు అనుగుణంగా విని యోగించుకునే విధంగా పర్యవేక్షించే నీటి సంఘాలు లేకపోవడంతో రైతుల్లో ఎవరికి వారే జవాబుదారీ అన్న ట్లుగా మారింది. కాళేశ్వరం జలాల ఎత్తిపోతలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కీలకంగా మారింది. జిల్లాలో మూడు ప్రాజెక్ట్ లు శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్న పూర్ణ అనంతగిరి ప్రాజెక్టులతో పాటు నిజాం కాలంలో నిర్మించిన ఎగువ మానేరు ప్రాజెక్టులతో చెరువులు, కుంటలను నింపు తూ వచ్చారు. కాళేశ్వ రంలో ఏర్పడిన అవాంతరాల నేప థ్యంలో ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరులోకి నీటిని నింపా రు. సమృద్ధిగా వర్షాలు పడడంతో చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి. జిల్లాలో కాళేశ్వరం 9వ ప్యాకేజీ లో కోనరావుపేట మండలం మల్కపేట వద్ద నిర్మించిన రిజ ర్వాయర్ పనులు పూర్తిచేసి కాలువల ద్వారా నీటిని కూడా వదిలారు.

జిల్లాలో వంద ఎకరాల పైన ఆయకట్టు ఉన్న చెరువులు 106, వంద ఎకరాల లోపు ఆయకట్టు గల 560 చెరువులు ఉన్నాయి. గతంలో మిషన్ కాకతీయ పథకంలో కూడా దాదాపు 294 చెరువులను మరమ్మతులు చేసుకున్నారు. మిగతా చెరువులు మరమ్మతులు జరగాల్సి ఉంది. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో మానేరు, మూలవాగులపై 24 చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టారు. ఇందులో కొన్ని చెక్ డ్యాంలు వరదకు కొట్టుకుపోయి వెక్కిరిస్తున్నాయి. మానేరు వాగులో కొట్టుకుపోయిన చెక్‌డ్యాంలు వివాదాస్పదంగానే మారిపోయాయి. నీటి సంఘాలు లేకపోవడంతో చెరువులు మరమ్మతులు, కొట్టుకు పోయిన చెక్‌డ్యాంలు, ఇతర పనుల గురించి ప్రభు త్వాన్ని ప్రశ్నించేవారే లేకుండా పోయారు. నీటి సంఘాల ఎన్నికలపై కొత్త ప్రభుత్వమైనా స్పందిం చాలని రైతులు కోరుతున్నారు.

దోస్త్ మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి

రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

గణేశ్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యిందని, కళాశాలలో 1139 సీట్లు కేటాయించామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ ప్రకటనలో తెలిపా రు. సీట్లు కేటాయించిన విద్యార్థులు జూన్ 6 లోగా దోస్త్ వ్యక్తిగత లాగిన్ లో సెల్ఫ్ రిపోర్ట్ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొ న్నారు. దోస్త్ రెండో విడత అడ్మిషన్ల ప్రక్రి య మే 30వ తేదీ నుంచి జూన్ 8వ వర కు కొనసాగుతుందని పేర్కొన్నారు.

గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం అండ..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఖతార్‌లో కార్మికులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గల్ఫ్ కార్మికులకు ఎల్ల వేళలా అండగా ఉంటుందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ గల్ఫ్ సమితి, ఖతార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఆవి ర్భావ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం ఖతార్ చేరుకున్నారు. ఈ సంద ర్భంగా దోహా విమానాశ్రయంలో ఆది శ్రీని వాస్‌కు ప్రవాస భారతీయులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆది శ్రీని వాస్ దోహ నగర పరిసరాల్లోని గల్ఫ్ కార్మి కుల క్యాంపును సందర్శించి వారితో మాట్లా డి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభు త్వం ఏర్పడిన నాటి నుంచి గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం, గల్ఫ్‌లో మరణించిన కార్మి క కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవాసి ప్రజావాణి, గల్ఫ్ కార్మికుల పిల్లల కు గురుకులాల్లో ప్రాధాన్యం, గల్ఫ్ సంక్షే మం కోసం ఏర్పాటు చేసిన గల్ఫ్ అడ్వైజరీ కమిటీ గురించి వివరించారు. వారు చ్చిన సూచనలు విని ఇంకా చేయాల్సిన విషయా లను రేవంత్‌రెడ్డితో మాట్లాడి గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ కమిటీ ఇప్పుడు పెట్టబోయే సమా వేశంలో చర్చించి అమలుచేసే విధంగా చూస్తానని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గల్ఫ్‌లో పనిచేసే ఇల్లు లేని పేదవారికి ఇం దిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని తెలి పారు. టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్, గల్ఫ్ వర్క ర్స్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గుగ్గిళ్ళ రవిగౌడ్, టీపీసీసీ ఖతర్ కన్వీ నర్ నిజామొద్దీన్ ఖాజా, తెలంగాణ గల్ఫ్ సమితి ఖతార్ ఫౌండర్ మెంబర్లు శంకర్ గౌడ్, ఎల్లన్న తల్లపెల్లి, వెంకటేష్, ఎల్లన్న మండపెల్లి, గడ్డిరాజు, చింతకుంట మహేం దర్ ఆది శ్రీనివాస్ వెంట ఉన్నారు.

కోడె గోస చూడు.. రాజన్నా..



కొన ఊపిరితో దీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కోడె

- ఒకే రోజు 8 కోడెల మృత్యువాత
- కొనఊపిరితో నాలుగు, అనారోగ్యంతో మరో పది..
- గోశాల సామర్థ్యానికి మించి కోడెల సంరక్షణ
- కొరవడిని ఆలయ అధికారుల పర్యవేక్షణ

భక్తులు వదిలేసి వెళ్లిన కోడెలు మృత్యువాత..

వేములవాడ రాజన్నకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు నిజ కోడెలను తీసుకువచ్చి మొక్కులు చెల్లిం చుకుంటున్నారు. అయితే అనారోగ్యంతో ఉన్న కోడెలు, జెర్సీ, పాలు మరవని కోడెలను భక్తులు తీసుకు వస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. అలాంటి వాటిని గోశాలలో తీసుకోవడం లేదని దీంతో భక్తులు రాజన్న ఆలయం ముందు వదిలేసి వెళుతున్నారని, తప్పనిసరి పరిస్థితిలో కోడెలను గోశాలకు తీసుక వస్తున్నామని, అలాంటి కోడెలు మృత్యువాత పడుతు న్నాయని చెబుతున్నారు. కోడెల సంరక్షణ కోసం వెటర్నరీ వైద్యులను సైతం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, 10 కోడెల వరకు అనారోగ్యంతో ఉన్నాయని, అందులో వైద్యుల చికిత్సతో కొన్ని కోలుకుంటున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.

వేములవాడ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కోడె కడితే కోటి వరాలనిచ్చే దేవుడిగా వెలుగొందు తున్న వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామికి ఎంతో విశ్వాసంతో భక్తులు అందజేస్తున్న నిజకోడెల పరి స్థితి అత్యంత దయనీయంగా తయారైంది. గోశాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ, అధికారుల నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనిపిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో గురువారం అర్ధరాత్రి ఒకేరోజు ఎనిమిది కోడెలు మృత్యువాత పడ్డాయి. దీంతో గుట్టుచప్పుడు కాకుండా గోశాల సిబ్బంది ట్రాక్టర్‌లో వాటిని తరలించి మూలవాగులో ఖననం చేయడం పట్టణంలో తీవ్ర చర్చనీయంశంగా మారింది. అంతే కాకుండా నాలుగు కోడెలు కొనఊపిరితో, మరో 10 కోడెలు అనారోగ్యంతో బక్కచిక్కిపోయి దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్న తీరు కలిచివేస్తోంది. రాజరాజే శ్వర స్వామివారికి ప్రతినెలా 100 నుంచి 150 కోడెల ను భక్తులు ఎంతో విశ్వాసంతో అందజేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గోశాలలో ప్రస్తుతం 1500 నుంచి 2 వేల వరకు కోడెలు, ఆవులు ఉన్నాయి.

సామర్థ్యానికి మించి కోడెలు..

రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలో కోడెల సం రక్షణ కోసం 11షెడ్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో షెడ్డులో సుమారుగా 50 నుంచి 60 కోడెలు నివసించేందుకు ఏర్పాటు చేశారు. 11 షెడ్లలో 600 వరకు కోడెలు ఉండాల్సి ఉండగా, 2 వేల వరకు కోడెలు ఉన్నట్లు తెలుస్తోంది. గోశాలలో కోడెల సం ఖ్యను సంబంధిత అధికారులు రికార్డులపరంగా చెప్పలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గోశాలకు వచ్చిన ప్రతి ఆవుకు, కోడెకు తప్పనిసరిగా ట్యాగ్ వేయాల్సి ఉండగా సగం వరకు కోడెల చెవు లకు ట్యాగ్‌లు లేకపోవడంతో పలు ఆరోపణలు గుప్పు మంటున్నాయి. గోశాలలోకి కోడెలు వచ్చే సమయం లోనే ట్యాగ్ వేయాల్సి ఉండగా గోశాలలో కొంత కాలంగా ఉంటున్న ట్యాగ్‌లు వేయకపోవడంతో పక్క దారి పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రాజన్న గోశాలపై సంబంధిత అధికారులు పర్య వేక్షణ లేకపోవడంతోనే నిర్వాహకులు కోడెల సం రక్షణపై పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అయితే గత సంవత్సరం కోడెల సంఖ్య పెరగడంతో ప్రభుత్వం కోడెలను రైతులకు అందించాలని నిర్ణ యించి అర్హులైన వారికి అందించారు. ప్రస్తుతం కోడెల పంపిణీ నిలిచిపోవడంతో కోడెల సంఖ్య అ మాంతం పెరిగిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కోడెలను రైతులకు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

బురదతో నిండిపోయిన గోశాల..

రాజన్న ఆలయ గోశాలలో కోడెల సంరక్షణ కోసం షెడ్లను ఏర్పాటు చేశారు. గతంలో పాత షెడ్లు 10 వరకు ఉండగా, అందులో ఒక షెడ్డులో కోడెలకు అందించే వరిగడ్డిని నిల్వచేయగా 9షెడ్లలో కోడెలను సంరక్షిస్తున్నారు. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మరో మూడు కొత్త షెడ్లను నిర్మించి అందుబాటులోకి తీసుకురావడంతో మొత్తంగా 11 షెడ్ల కోడెలు నివసించేందుకు అనువుగా ఉన్నాయి.

ఒక్కో షెడ్డులో 50 నుంచి 60 కోడెలు ఉండేలా ఉం డేందుకు సౌకర్యం ఉంటుంది. అయితే 11 షెడ్ల లో 600 కోడెలు మాత్రమే ఉండే అవకాశం ఉండగా ప్రస్తుతం గోశాలలో ఉండే కోడెల సరైన లెక్కను అధికారులు చెప్పడం లేదు. సుమారుగా 1500 నుంచి 2 వేల వరకు కోడెలు గోశాలలో ఉన్నట్లు స్థానిక సిబ్బంది అంచనా వేస్తున్నా రు. గోశాల సామర్థ్యానికి మించి కోడెలు గోశాలలో ఉండటంతో ఆరు బయట చలువ పందిళ్లు వేసి సంరక్షిస్తున్నారు. దీంతో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు చలువ పందిళ్ల కింద నేల బురదమయంగా మారింది. కోడెల కాళ్లు బురదలో దిగబడిపోతున్నా పట్టించు కునే వారు కరువయ్యారు.

పర్యవేక్షణ కరువు..

రాజన్న ఆలయానికి వచ్చే కోడల సంరక్షణ కోసం పట్టణంలోని కట్టకింద ఒక గోశాల,తిప్పాపూర్‌లో ఒక గోశాలను ఏర్పాటు చేశారు. అయితే కోడెల సంరక్ష ణపై పర్యవేక్షణ కొరవడిందని తెలుస్తోంది. గోశాల లో 2 వేల వరకు కోడెలు ఉన్నప్పటికి అధికారులు గోశాల వైపు కన్నెత్తి చూడటం లేదని, నామమా త్రంగా వచ్చి చూసి వెళతారని చెబుతున్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



కరీంనగర్ జట్టు నుంచి 108 పరుగులు చేసిన సాత్విక్, 106 పరుగులు చేసిన కార్తీక్ పటేల్

కరీంనగర్ స్పోర్ట్స్, మే 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికె ట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసి యేషన్ నిర్వహిస్తున్న రెండు రో జుల (2డే) క్రికెట్ పోటీలు ఉత్సా హంగా సాగుతున్నాయి. క్రికెట్ లీగల్ పోటీల్లో భాగంగా శుక్రవా రం మూడు మ్యాచ్‌లను ప్రారం భించారు. కరీంనగర్ జిల్లా కేం ద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ ఉన్న త పాఠశాల మైదానంలో హుజూ రాబాద్, పెద్దపల్లి జట్ల మధ్య లీగ ల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మొదటి ఇన్నింగ్స్ పూర్తయ్యేసరికి హుజూ రాబాద్ జట్టు 37వ ఓవర్లలో 134 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పెద్దపల్లి జట్టు 47 ఓవర్లలో 304 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్ పూర్తయ్యేసరికి పెద్దపల్లి జట్టు భారీ ఆధిక్యత లో కొనసాగుతోంది. రెండో మ్యాచ్‌ను జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ మైదానంలో కరీంనగర్ టౌన్, జగిత్యాల మ్యాచ్‌ను ప్రారం భించారు. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్ పూర్తయ్యేసరికి మొదట బ్యా టింగ్ చేసిన కరీంనగర్ టౌన్ జట్టు 34.4 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌ ట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన జగిత్యాల జట్టు 27 ఓవర్లలో 140 పరుగులు చేసి 12 పరుగుల ఆధిక్యతలో కొనసాగుతోంది.

అలాగే మూడో మ్యాచ్‌ను వేములవాడ క్రీడామైదానంలో సిరిసిల్ల, కరీం నగర్ రూరల్ జట్ల మధ్య నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటిం గ్ ప్రారంభించిన సిరిసిల్ల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 179 పరుగులు చేసి 8 వికెట్లు కోల్పోయింది. జట్టు నుంచి కార్తీక్ పటేల్ 106 పరుగులు చేసి నా టౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ రూరల్ జట్టు 47.2 ఓవర్లలో 243 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. కరీంనగర్ జట్టు నుంచి సాత్విక్ 108 పరుగులు చేయడం విశేషం. ఈ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు భారీ ఆధిక్యంతో కొనసాగుతుంది. ఈ మ్యాచ్‌ల రెండో ఇన్నింగ్స్‌ను శనివారం 40 ఓవర్ల చొప్పున నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌ల నిర్వహ ణలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు కే మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న హుండీల ఆదాయం రూ. కోటి



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

మల్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి): కొండ గట్టు అంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా 1,00,95,392 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. 24 రోజులకు గాను ఆల యంలోని 12 హుండీలను విప్పి శుక్రవారం లెక్కించగా నగదుతో పాటు 44 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో స్థానాచార్యులు కపీంధర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, పర్య వేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహర నాథ్, అధికారులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్, రాములు, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు, నిర్వహకుడు రమేశ్, పోలీసులు తదితరు లు పాల్గొన్నారు. కాగా ఇన్నాళ్లు హుండీ లలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా కొన్నాళ్లుగా తూకం వేయ కుండానే సంచిల్లోనే సీజ్ చేసి మళ్లీ హుండీలలోనే వేస్తున్నారు.

ఆర్సీబీ ఐపీఎల్ కప్ గెలుచుకోవాలి

హుండీలో చీటీతో భక్తుడి వేడుకోలు

ఐపీఎల్‌లో చాలా ఎళ్లుగా కప్పు కోసం ఎదురుచూస్తూ ఫైనల్‌కు వెళ్లిన రాయల్ చాలేంజ్ బెంగళూర్ జట్టు ఈ సారి కప్పు అందుకునేలా చూడూ అంజన్న స్వామి అంటూ ఓ భక్తుడు హుండీలో చీటీ రాసి వేశాడు. శుక్రవారం హుండీల సొమ్ములు లెక్కించగా అందులో భక్తుడి చీటీ లభిం చింది. దీంతో క్రికెట్ అభిమానం కొండంత అంటూ పలువురు ముచ్చటించుకున్నారు.

వేసవి కార్యాచరణ ప్రణాళిక విజయవంతం

టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు

గణేశ్‌నగర్,మే 30(ఆంధ్రజ్యోతి): వేసవి కార్యాచరణ ప్రణా ళిక విజయవంతంగా అమలు చేశామని విద్యుత్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ మేక రమేష్ బాబు స్పష్టం చేశా రు. శుక్రవారం ఎస్ఈ కర్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో విద్యుత్ ఆధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విని యోగ దారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించా మని తెలిపారు. ఇప్పటివరకు 325 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 355 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని అన్నారు. దీంతో ఓవర్ లోడ్ ఇబ్బంది లేకుండా చేయగలి గామని అన్నారు. అదే విధంగా ఇప్పటివరకు 39 కిలోమీటర్ల మేర 13 సబ్‌స్టేషన్లకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ఉందని అన్నారు.

వోల్టేజ్‌కు అనుగుణంగా హెచ్చు తగ్గులు లేకుండా ఉండ టానికి లైన్‌లలో 23నెంబర్స్ 600కెవిఎఆర్ కెపాసిటర్ బ్యాంకు లు క్షేత్ర స్థాయిలో పెట్టినట్లు తెలిపారు. అలాగే 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 201 ఎంవీఆర్/2 ఎంవీఆర్ కెపాసిటర్ బ్యాం కులు ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరా ఘనణీయంగా మెరుగు పరచడానికి దోహద పడుతుందన్నారు. వీటితో టెక్నికల్ నష్టాలు తగ్గుతాయని, పరికరాల మన్నిక కూడా చాలాకాలం పెరుగుతుందన్నారు. మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

భగత్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-1 డిపో పరిధిలో శనివారం డయల్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, తిమ్మాపూర్, మానకొండూర్, బెజ్జం కి, వీణవంక మండలాల్లోని ప్రయా ణికులు ఉదయం 11 గంటల నుం చి మధ్యాహ్నం 12 వరకు 81219 93780 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



గంగాధరలో మాట్లాడుతున్న డీఏవో భాగ్యలక్ష్మి

గంగాధర, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని కేంద్ర వ్యవసాయ మండలి శాస్త్ర వేత్త డా. బ్ర జేంద్ర అన్నారు. వికసిత్‌కృషి సంకల్ప అభి యాన్‌లో భాగంగా శుక్రవారం గంగాధర, గర్శ కుర్తి రైతువేదికల్లో రైతులకు అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు పంటమార్పిడి పద్ధతి పాటిస్తే దిగుబడులు పొందుతారన్నారు. తక్కువ మోతాదులో రసా యన ఎరువులు వినియో గించాలని సేంద్రియ వ్యవ సాయ పద్ధతులు అలవర్చు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూత న సాంకేతిక పరిజ్ఞానం, కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ లు చేస్తున్న రైతు సంక్షేమ పథ కాలు, సబ్సిడీలను వివరించారు. ప్రత్యక్షంగా మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వ హించి భూసారపత్రాన్ని రైతులకు అందించా రు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాధికారి భాగ్య లక్ష్మి, భారత వ్యవసాయ మండలి శాస్త్రవేత్త లు సునీత కోట, కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేశ్వ రావు, వేణుగోపాల్, ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీని వాస్‌రెడ్డి, సస్యరక్షణ శాస్త్రవేత్తలు, అధికారు లు, రైతులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం

- వేములవాడకు 50 వేల మంది భక్తులు
- రాజన్న సేవలో హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ

వేములవాడ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలు మూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ఆవరణ, ప్రాం గణం భక్తులతో కిక్కిరిసిపోయి కనిపించింది. శుక్ర వారం తెల్లవారు జామునుంచే భక్తులు రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకు న్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కును చెల్లిం చుకున్నారు. పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. దాదాపు 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆల యాధికారులు వెల్లడించారు.



హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ పోలీసుల గౌరవ వందనం

రాజన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సమేతం గా దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన న్యాయమూర్తి లక్ష్మీనారాయణకు స్థానిక జడ్జి పూల మొక్కను అందజేసి స్వాగ తం పలుకగా, పోలీసులు గౌరవ వందనాన్ని సమర్పించారు. రాజన్న ఆలయ అర్చకులు, ఈవో పూర్ణకుంభ స్వాగతం పలికా రు. ముందుగా శ్రీలక్ష్మీగణపతి పూజలో పాల్గొని స్వామివారలను దర్శించుకున్నారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు వే దోక్త ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శ్రీస్వామివారి శేషవస్త్రంతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

డీఎస్ఆర్ యాప్‌పై ఆసక్తి చూపని కార్యదర్శులు

కరీంనగర్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎస్ఆర్ (డైలీ సానిటేషన్ రిపోర్ట్) యాప్‌పై పంచాయతీ కార్యదర్శులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 25లోపు అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని చెత్త సేకరణ వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కార్యదర్శులు మాత్రం బయోమెట్రిక్ ద్వారా చెత్త సేకరణకు ఆసక్తి చూపడం లేదు. పంచాయతీ శాఖతోపటు, గ్రామంలో అమలయ్యే అన్ని శాఖల పనలను తామే పర్యవేక్షిస్తామని, పనుల వివరాలను ఇచ్చిన సమయంలోనే యాప్‌లో అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదని పేర్కొంటున్నారు.



నగునూర్‌లో ఫొటో దిగుతున్న కార్యదర్శి

గ్రామాల్లో కార్యదర్శుల పాత్రే కీలకం

గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా ఉండాల్సిందే. పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూనే ఇతర శాఖల పనులను నిర్వహించాల్సి ఉంటుంది. ఇటీవల ప్రజా పాలన, ఇందిరమ్మ లబ్ధిదారులు, తెల్ల రేషన్ కార్డు దారుల ఎంపిక వంటి ఆయా శాఖల పనులను నిర్వహించారు. 18 నెలలుగా గ్రామ పంచాయతీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. సర్పంచుల పదవి కాలం ముగిసి 15 నెలలు గడిచింది. అప్పటి నుంచి కార్యదర్శులే ప్రత్యేక అధికారులుగా గ్రామాల్లో పాలనా వ్యవహారాలను సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోయిన చెత్త సేకరణకు ప్రతీ రోజు ట్రాక్టర్‌లో డీజిల్ పోయించాల్సి వస్తుంది. దీంతో పాటు గ్రామంలో పంపు సెట్ల మరమ్మతు, చిన్నచిన్న పనులు తప్పక చేయాల్సిన పరిస్థితి. పని భారంతో చాల మంది కార్యదర్శులు ఇబ్బందులకు గురవుతున్నారు.

రాష్ట్ర అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు కృషి



బ్యాడ్మింటన్ క్రీడాకారులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కృషి చేస్తున్నారని, ఆయన పాత్ర విశిష్టమైనదని కరీంనగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో కరీంనగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీధర్‌బాబు బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తండ్రి స్వర్గీయ శ్రీపాదరావు అడుగుజాడల్లో నడుస్తూ రాజకీయాల్లో సంచలనాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుంటపల్లి స్వామి, ప్రతినిధులు రమేష్, ముస్తఫా, నరేష్, బాబు శంకర్, మధుకర్, గంగరాజు, శివప్రసాద్, లక్ష్మణరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పేవి అన్నీ అబద్ధాలు

సుభాష్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు వాడకుండా దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ధాన్యం పండిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రగల్భాలు పలికారని, అవి అన్నీ అబద్ధాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని వీపార్క్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. గురువారం జిల్లా కేంద్రంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజక్టులో 85 పిల్లర్లు ఉన్నాయని, అందులో రెండు పగుళ్లు చూపాయని, దానికే కూలిపోయిందంటారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఒక్కటై నీటిని పోలవరం వైపు వదులుతున్నారని ఆరోపించారు. రాజకీయం చేయకుండా మరమ్మతు చేసి అందుబాటులోకి తేవాలన్నారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, రామడుగు మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో సన్నగిల్లిన విశ్వాసం

భగత్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సీపీఐ నూతన జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగంపై ఆజమాయిషి కరువైందన్నారు.

రేపు మహాశక్తి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయం ఆదివారం పంచాదశ (15వ) వార్షికోత్సవానికి ముస్తాబైంది. వార్షికోత్సవానికి ఆలయాన్ని ప్రతిష్ఠించిన జగద్గురు శంక రాచార్య హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి, కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇన్‌చార్జి డీఈవోకు అభినందనలు

కరీంనగర్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి డీఈవో బాధ్యతలు చేపట్టిన మొండయ్యకు శుక్రవారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్ట రవీంద్రాచారి,జిల్లా ఆర్థిక కార్యదర్శి గుండ శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు ఉన్నారు.

టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా మంజూర్ అలీ, అశోక్‌రావు, ప్రభాకర్‌రావు, దయాకర్, రమణారావు తదితరులు డీఈవోను కలిశారు.

తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సుదర్శనం, సర్వ శిక్ష అభియాన్ క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రధాన క్యాదర్శి ఆర్ శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు అశోక్ రెడ్డి అభినందనలు తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం

కరీంనగర్ అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్‌యూ ఎదుట వాకర్స్ కేక్ కట్ చేశారు. మాతాశిశు ఆస్పత్రిలో శ్రవణ్ నాయక్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. మార్కెట్ రోడ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దన్నాసింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందిరా చౌక్ వద్ద కొట్టె ప్రభాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. కార్ఖాన గడ్డ వృద్ధాశ్రమంలో సుమన్ గ్యాస్ట్రో హాస్పిటల్ ఆధ్వర్యలో, సివిల్ ఆసుపత్రిలో కిరణ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. మందిరాల్లో ప్రార్థనలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సమద్ నవాబ్, చర్ల పద్మ, కర్ర రాజశేఖర్, కాంరెడ్డి రాంరెడ్డి, స్వామిగౌడ్, కాశెట్టి శ్రీనివాస్, పోతారం సురేందర్, కొరివి అరుణ్‌కుమార్, యువజన కాంగ్రెస్ నాయకుడు ఫహద్, తాళ్లపల్లి శ్రీకాంత్, గుర్రం వాసు, సయ్యద్ ఖమ్రోద్దీన్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట/జమ్మికుంట రూరల్/వీణవంక: మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పెద్దికుమార్, మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సారంగపాణి, సంపత్, ప్రవీణ్, జమ్మికుంటలో పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, సాయిని రవి, ముద్దమల్ల రవి, పాతకాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ టౌన్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌జీటీయూ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో చేపట్టనున్న బడిబాట ప్రచార రథాన్ని ఇన్‌చార్జి డీఈవో మొండయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం చేపట్టడం హర్షణీయమన్నారు. ఎస్‌జీటీ యూ రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలు, కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు.

గణేశ్‌నగర్: ఎల్ఎల్‌బీ 2018-19 విద్యా సంవత్సరం ఒకటో, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో సబ్జెక్టులు ఉండి గడువు ముగిసిన విద్యార్థులకు మరో అవకాశం కల్పించాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు కోరారు. శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. యూని వర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్కశ్రీనివాస్, నగర అధ్యక్షుడు బొంకురి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం హుండీలను లెక్కించారు. రూ2,08,025 ఆదాయం సమకూరినట్లు చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: పుణ్య శ్లోక రాణి అహల్యాబాయి హోల్కర్ 300 జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం బీజేపీ ఈస్ట్ జోన్ పరిధిలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అర్చకుడు అనంత నారాయణాచార్యను సన్మానించారు. జోన్ అధ్యక్షుడు అవుదుర్తి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: తెలంగాణ ఉద్యమకారులకు 200 గజాల నివేశన స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పద్మ, జిల్లా అధ్యక్షుడు యువరాజ్ కోరారు. ఈమేరకు శుక్రవారం కరీంనగర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలకు రూ30వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లిటిల్ ఆర్కిడ్స్ ప్రీ స్కూల్‌ను శుక్రవారం మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, నిర్వాహకులు కిరణ్మయి, లావణ్య, నాయ కుడు సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇంకెప్పుడు?

(3వ పేజీ తరువాయి)

చొప్పదండి నియోజకవర్గంలో 572, మానకొండూర్ 465, హుస్నాబాద్ 297, హుజూరాబాద్‌లో 463 ఇళ్లను మంజూరు చేశారు. మొత్తం 2,027 ఇళ్ల మంజూరు కాగా 975 ఇళ్లకు మార్క్ అవుట్ ఇచ్చారు. ఇప్పటి వరకు 380 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమై 307 బేస్‌మెంట్ లెవల్‌కు, 65 ఇళ్ల పనులు లెంటల్ లెవల్‌కు, 8 ఇళ్ల పనులు రూఫ్ వేసే లెవల్‌కు చేరుకున్నాయి. 346 ఇళ్లకు బేస్‌మెంట్ లెవల్ వరకు డబ్బు చెల్లించారు.

రెండో దశలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం మినహా చొప్పదండిలో 1,537, మానకొండూర్‌లో 1,570, హుస్నాబాద్‌లో 638, హుజూరాబాద్ నియోజకవర్గంలో 2,040, మొత్తం 5,785 ఇళ్లకు మంజూరు ఇచ్చారు. వీటిలో హుస్నాబాద్ నియోజకవర్గంలో 97 ఇళ్లకు, హుజూరాబాద్ నియోజకవర్గంలో 29 ఇళ్లకు, చొప్పదండి నియోజకవర్గంలో ఏడు ఇళ్లకు, మానకొండూర్ నియోజకవర్గంలో మూడు ఇళ్లకు మార్క్ అవుట్ ఇచ్చారు.

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఫేజ్-1లో 230 ఇళ్లకు మంజూరు ఇచ్చారు. కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లిలో 194, కరీంనగర్ మండలంలోని బహదూర్‌ఖాన్ పేటలో 106 ఇళ్లకు మంజూరవగా 154 ఇళ్లకు మార్క్ అవుట్ పూర్తయింది. 60 ఇళ్లు ప్రగతిలో ఉన్నాయి. ఇందిరమ్మ కమిటీలు లేక 3,270 ఇళ్లకు ఇంకా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదు.

ఆదర్శంగా నిలిచిన ‘విద్యావాహిని’

(3వ పేజీ తరువాయి)

వినూత్న బడిబాట కార్యక్రమంతో సర్కారు బడిలో 250 మందిని చేర్పించడానికి తల్లిదండ్రులు పేర్లు రాయించారు.

● విద్యావాహినికి రాష్ట్ర అధికారుల ప్రశంసలు

హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఇటీవల మండలాల వారీగా నిర్వహించిన శిక్షణలో విద్యావాహినిపై వీడియో ప్రదర్శన ఇచ్చారు. మల్టీజోన్1లో 17 మండలాల శిక్షణలో గంగాధర నుంచి ఎంఈవో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంపై వివరించడంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రశంసలు అందించారు. ఉత్తమ మోడల్‌గా గుర్తించి ఇతర మండలాల్లో అమలు చేయా లనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఎంఈవో తెలిపారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

కరీంనగర్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు నగరపాలక సంస్థలో ఏర్పాట్లు చేయాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. జూన్ 2న వేడుకలను నగరపాల సంస్థలో ఘనంగా నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఈఈ సంజీవ్ ఉమార్, డీఈలు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో ఏటా 80 లక్షల మంది మృతి

సుభాష్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం పొగాకు ఉత్పత్తుల కారణంగా ఏటా ప్రపంచంలో 80 లక్షల మంది చనిపోతున్నారని మెడికవర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ లోకేష్ బీరకాయల తెలిపారు. శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సిగరెట్, బీడీ, గుట్కా తంబాకు వంటి పదార్థాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు.

స్కాలర్ షిప్‌ల రిజిస్ట్రేషన్ గడువు 30 వరకు పొడిగింపు

గణేశ్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం 2024-25కు సంబంధించి కళాశాలల విద్యార్థుల స్కాలర్ షిప్‌ల రిజిస్ట్రేషన్ గడువును జూన్ 30వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.పవన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, వికలాంగులు, మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, telanganaepass.cgg.gov.inలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

బెస్ట్ అవలెబుల్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం 2025-26కు సంబంధించి జిల్లాలోని బెస్ట్ అవలెబుల్ స్కూల్స్‌లో 1వ తరగతి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పవన్‌కుమార్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాలతో జూన్ 16 సాయంత్రం 5లోగా ఉపసంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలో ఆరుగురు డీబార్

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం మాల్‌ప్రాక్టీస్ చేస్తున్న ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు శాతవాహన యూని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. నాలుగో సెమిస్టర్‌లో ఐదుగురు, ఆరోసెమిస్టర్ ఒకరు డిబార్ అయినట్లు పేర్కొన్నారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

చొప్పదండి, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రావు అన్నారు. వికసిత్‌కృషి సంకల్ప్‌అభియాన్ శిక్షణలో భాగంగా మండలంలోని చాకుంట, కొలిమికుంటలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపన్న రైతు దేశానికి గర్వకారణమనే ఉద్దేశంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని జూన్ 12వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాగులో సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7400పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు పదిమంది రైతులు 101క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠధర రూ.7300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

శంకరపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్, మెట్‌పల్లి, తాడికల్ గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలు అందజేసి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శంకరపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగా 33కేవీ లింక్‌లైన్ ఏర్పాట నేపథ్యంలో మండలంలోని మొలంగూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రఘు తెలిపారు. మొలంగూర్, ఇండస్ట్రియల్ ఏరియా, చింతలపల్లి, నల్ల వెంకయ్యపల్లి, గుడాటిపల్లికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సబ్ జూనియర్ బాలికల ఓపెన్ హాకీ సెలక్షన్లు

హుజూరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): సబ్‌జూనియర్ బాలికల విభాగానికి సంబంధించిన ఓపెన్‌హాకీ సెలెక్షన్లు జూన్1న సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ రైల్వేగ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ జాయిం ట్‌సెక్రెటరీ శ్రీనివాస్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. పాల్గొనే బాలికలు శనివారంలోగా జిల్లా హాకీ అసోసియేషన్ ఇన్‌చార్జి కార్యదర్శి మహ్మద్ లియాకత్ అలీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జయరాజ్ పేరిట అవార్డు హర్షణీయం

కరీంనగర్ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన బాలీవుడ్ నటుడు పైడి జయరాజ్ పేరిట జాతీయ స్థాయిలో ప్రభుత్వం అవార్డును ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి కఫిసొ అధ్యక్షుడు, సినీ విమర్శకుడు పొన్నం రవి చంద్ర, పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

కరీంనగర్ ముద్దు బిడ్డ జయరాజ్ జీవిత చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చిన సీనియర్ జర్నలిస్ట్, ఫిల్మ్ క్రిటిక్ పొన్నం రవిచంద్ర కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతా కరపత్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం ఆవిష్కరించారు. యూటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్ పాల్గొన్నారు.

చొప్పదండి పట్టణాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి, మే 30 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పట్టణంలో జరుగు తున్న సెంట్రల్ లైటింగ్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పనుల్లోవేగం పెంచాలని, పూర్తిస్థాయిలో నాణ్యతప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.అంతకుముందు చిట్యాలపల్లి, గుమ్లాపూర్ బీటీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి: ప్రతి క్రీడకారుడు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండిలో జరుగుతున్న సీపీఎల్ క్రికెట్‌పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు.

వినతిపత్రం అందజేత..

రామడుగు: పంచాయతీ కార్యదర్శుల జాయింట్ యాక్షన్‌కమిటీసభ్యులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి దీర్ఘకాలికంగా పంచాయతీ కార్యద ర్శులకు ఉన్నసమస్యలపై వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వానికి విన్నవిస్తానని హామీ ఇచ్చారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

శంకరపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని ఏడీఏ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేశవపట్నం రైతువేదికలో సొసైటీ, ప్రైవేట్ విత్తన, ఎరువుల, క్రిమిసంహారక మందుల డీలర్లతో ఏవో వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ ఎరువులు తప్పనిసరిగా పీవోఎస్ మెషిన్ ద్వారానే అమ్మాలని, బిల్, రసీద్ తప్పనిసరిగా వినియోగదారులకు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాగంపేటలో సివిల్ రైట్స్ డే

చొప్పదండి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటలో శుక్రవారం సివిల్‌రైట్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి క్రయ విక్రయాలు లేకున్నప్పటికీ రాగంపేటకు చెందిన దళిత మహిళా రైతు భూమిని ఇతరులపై పేరుపై నమోదు చేశారని, రైతు భూమి రికార్డులు సరిదిద్దాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు.

సమీక్షా సమావేశంతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు

మానకొండూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : హెలికాప్టర్‌లో తిరుగుడు రాష్ట్ర మంత్రులకు సోకుగా మారిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆరోపించారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో గురువారం రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మరో ఇద్దరు మంత్రులతో కలిసి నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంతో జిల్లాకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు హెలికాప్టర్‌లో తిరుగుతూ రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో పాల్గొన్న ముగ్గురు మంత్రులు ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. పేద యువతకు సిబిల్ స్కోర్ ఎలా ఉంటుందని ఒకవేళ ఉంటే బ్యాంకులే నేరుగా రుణాలు మంజూరు చేస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులున్నారు.

పురోహితులకు సన్మానం

హుజూరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రాణి అహిల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వొడ్నాల చంద్రిక, చిదురాల రాణి, గంగిశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాపల్లి గ్రామానికి చెందిన అలుమల్ల సురేందర్‌రెడ్డి మృతి చెందగా కుటుంబ సభ్యులను శనివారం మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పరామర్శించారు. మృతుడి కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

తిమ్మాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అంటరానితనంపై చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు సన్మాన సభ

మానకొండూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో నేడు జరిగే మంద క్రిష్ణమాదిగ సన్మానసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లాఉపాధ్యక్షుడు ఎల్కపల్లిపోల్ కోరారు. మందక్రిష్ణ మాదిగ 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు చేపట్టారన్నారు. అలాంటి వ్యక్తికి పద్మశ్రీ అవార్డును ప్రకటించడం సంతోషదాయకమన్నారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న హాస్యనటుడు ఆర్ఎస్ నంద

క్రీడలతో పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల

హుజూరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలు శారీరకంగా.. మానసికంగా ఉత్సాహవంతులుగా ఉండడానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని యూట్యూబ్ హాస్యనటుడు ఆర్ఎస్ నంద అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయనహాజరై ఆర్ఎస్ నంద మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డాక్టర్ వీణ, ముక్కెర రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్‌క్యాంపులతో విద్యార్థులకు మేలు

జమ్మికుంట: సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ వెంకటొరెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మికుంటలోని కాకతీయ ఈ-టెక్నో పాఠశాలలో మండల విద్యాధికారిణి హేమలత ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సమ్మర్‌క్యాంపులు ఏర్పాటు చేయడం మంచి విషయం అన్నారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.